వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 16 అక్టోబరు 2026



## సంతానలక్ష్మి గా దర్శనమిచ్చిన అమ్మవారు

ఖమ్మం, అక్టోబర్ 15 ( వాయిస్ టుడే): ఖమ్మం పట్టణ బ్రాహ్మణ బజార్లో, నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో దేవీ నవరాత్రుల సందర్భంగా గురువారం నాడు అమ్మవారు సంతాన లక్ష్మీ అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఘనంగా సాగుతున్న దేవీ నవరాత్రుల లో భాగంగా ప్రతిరోజు మాదిరిగానే ఈరోజు కూడా భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ సేవలో అర్చకులు శశి కుమార్, శ్రీనివాస చార్యులు విధివిధానాలతో కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ అనంత పద్మనాభం , నిర్వాహకురాలు సరోజిని , లక్ష్మీ , సుధా, ప్రమీల, మంజుల, అలివేలుమంగా, భవాని సత్యవతి, ఇందిర, ఉష, శైలజ, విజయలక్ష్మి ప్రభావతి కరుణ తదితరులు పాల్గొన్నారు.



## బుట్టి మోషయ్యా మృతి పట్ల హకీం బృందం సంతాపం



ఖమ్మం , అక్టోబర్ 15 ( వాయిస్ టుడే): ప్రభుత్వ డ్రైవర్ మోష య్యా మృతి పట్ల ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ డ్రైవర్ల సంఘం మాజీ అధ్యక్షులు ఎండి. అబ్దుల్ హకీం, వారి బృందంతో వెళ్లి, పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ హకీమ్ మాట్లాడుతూ, మోష య్యా సేవలను కొనియాడారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారు లేని లోటు తీర్చలేనిదని, సంఘ ఐక్యతకు వారు అందించిన సహకారం మరువలేనిది అన్నారు. వారి కుటుంబానికి, సదా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హకీం తో పాటు కాజా మియా, ఏం బాబురావు, హరినాథ్ బాబు, హుస్సేన్, సాగర్, రహీం ఇతరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

### డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ

భద్రాద్రి కొత్తగూడెం: జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంగళరావు నగర్ సబ్‌సెంటర్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, రోగులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఇందులో భాగంగా ప్రతి ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమన్వయంతో శ్రమదానం నిర్వహించాలని ఆదేశించారు. శ్రమదానానికి ముందు, అనంతరం తీసిన ఫొటోలను సంబంధిత అధికారులకు పంపించాలని స్పష్టం చేశారు.

ఆసుపత్రి ప్రాంగణాలు, రోగులు వేచి ఉండే ప్రదేశాలు, గదులు, పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, వ్యర్థ పదార్థాల క్రమబద్ధమైన తొలగింపు వంటి అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంహెచ్ఓ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం

### రికార్డులు, పెండింగ్ కేసులు, లాకప్ గదుల పరిశీలన.. బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశం

### ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి.. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు




చిగురుమామిడి, అక్టోబర్ 15 (వాయిస్ ఆఫ్ ప్రజలు): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం (ఐపీఎస్) చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించిన ఆయన.. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తూ, వారికి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, పెండింగ్ కేసులకు సంబంధించిన రికార్డులు, రౌడీ షీటర్ల వివరాలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల నమోదు నుంచి దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ నిబంధనలను పాటించాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని, తమ సమస్యను చెప్పుకునేందుకు వచ్చిన వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర నిఘా**

గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ గౌష్ ఆలం సూచించారు. గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో ఎలాంటి అలసత్వానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి, బాధితులకు న్యాయం జరిగేలా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం పోలీసుల ప్రధాన బాధ్యత అని ఆయన సూచించినట్లు తెలిసింది. ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంపొందించేలా సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్, చిగురుమామిడి సబ్‌ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చలికాలంలోనూ ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు



ఖమ్మం : చలికాలం ప్రారంభమైనప్పటికీ పగటిపూట ఎండ తీవ్రత వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఖమ్మం జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు. ఉదయం, సాయంత్రం చల్లని వాతావరణం ఉన్నప్పటికీ మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున వాతావరణ పరిస్థితులను బట్టి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఎండ తీవ్రతతో కలిగే ఆరోగ్య సమస్యలు ముఖ్యంగా, ఎండలో ఎక్కువసేపు పనిచేయడం లేదా తిరగడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గడం, అధిక దాహం, నీరసం, తలనొప్పి, తల తిరగడం, కండరాల నొప్పులు వంటి సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు. తీవ్రమైన సందర్భాల్లో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:-** రోజంతా తగినంత నీరు తాగాలి. దాహం వేయకపోయినా కొద్దికొద్దిగా నీరు తాగుతూ ఉండాలి.మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు అత్యవసరం కాని బయట పనులను తగ్గించుకోవాలి- బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ ఉపయోగించాలి. వీలైనంత వరకు తేలికపాటి, వదులుగా ఉండే లేత రంగు దుస్తులు ధరించాలి, ఎక్కువసేపు ఎండలో పనిచేసేవారు తరచుగా నీడలో విశ్రాంతి తీసుకోవాలి,శరీరంలో నీటి లోపం ఏర్పడం వల్ల సోడియం లెవెల్స్ పడిపోయి పోవడం జరుగుతుంది, కావున మంచినీళ్లు ఎక్కువగా తీసుకోవాలని, తగిన ద్రవ పదార్థాలు తీసుకోవాలిని,అవసరమైన సందర్భాల్లో వైద్యుల సూచనల మేరకు ఓఆర్ఎస్ ద్రావణం ఉపయోగించాలిని, చిన్నపిల్లలు, వృద్ధులను ఎక్కువసేపు ఎండలో ఉంచకూడదు. నిలిపి ఉంచిన వాహనాల్లో పిల్లలను ఒంటరిగా వదిలి కూడదు అని, తల తిరగడం, అధిక నీరసం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని నీడ ఉన్న ప్రదేశానికి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలి అని పేర్కొన్నారు.వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే తక్షణ వైద్య సహాయం పొందాలి అని,శరీర ఉష్ణోగ్రత బాగా పెరగడం, గందరగోళం, స్పృహ కోల్పోవడం, మూర్ఛ వంటి లక్షణాలు వడదెబ్బకు సంకేతాలు కావచ్చని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలి అని బాధితుడిని చల్లని ప్రదేశానికి తరలించి, శరీరాన్ని చల్లబరిచే చర్యలు చేపట్టాలి. స్పృహ లేని వ్యక్తికి నోటిద్వారా నీరు లేదా ఇతర ద్రవాలు ఇవ్వకూడదు అని,ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఏవైనా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు సూచించారు.




## ప్రముఖ కవి బుక్క సత్యనారాయణకు సాహితీసేవ, పురస్కారం

ఖమ్మం , అక్టోబర్ 15 ( వాయిస్ టుడే): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గజల్ గాయకుడు, గజల్ శ్రీనివాస్, 50 వసంతాల సంగీత ఉత్సవం ,40 వసంతాల గజల్ గాన వేడుకలు, 60 వసంతాల తెలుగు గజల్ కు నీరాజనం, మహోత్సవం, గుంటూరు భారతీయ విద్యా భవన్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను గజల్ చారిటబుల్ ట్రస్ట్ , ఆంధ్ర ప్రదేశ్ భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో, నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా వేదికపై ప్రముఖ కవి, రచయిత ,నంది అవార్డు గ్రహీత, సామాజిక సేవకులు, డాక్టర్ బుక్కా సత్యనారాయణకు, సాహితీ సేవా పురస్కారం , శాలువతో సత్కరించి ప్రశంసా పత్రం , విశిష్ట పురస్కార జ్ఞాపికను, అందజేశారు. సత్యనారాయణ తెలుగు భాష కనుమరుగవుతున్న దశలో తోటి కవులను రచయితలను సంఘటిత పరుస్తూ సాహిత్య కార్యక్రమాలలో, సామాజిక కార్యక్రమాలలో తన వంతు కర్తవ్యాన్ని పోషిస్తూ సత్యనారాయణ ఆదర్శంగా నిలవటమే కాకుండా, అనేకమంది ప్రముఖులతో అవార్డులతో, రివార్డులతో, సత్కార సన్మానాలను పొందారు.ఈ సేవలు అన్నిటిని గుర్తించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గజల్ నాయకుడు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా సాహితీసేవ పురస్కారం లభించింది. ఈ గౌరవాన్ని అందించిన డాక్టర్ గజల్ శ్రీనివాస్, గజల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు ,గజల్ కవులకు ,గాయకులకు, ముక్క సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కొని డ్రైవర్ దుర్మరణం

కల్లూరు: ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలోని కల్లూరు మండలం చంద్రుపట్ల సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొన్న ఘటన గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర, దులే జిల్లా నందనేకి చెందిన డీసీఎం డ్రైవర్ గణేశ్ సాంబాజీ పటేల్(46) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రుపట్ల సమీపంలో బొగ్గులోడుతో ఓ లారీ రహదారి పక్కన ఆగి ఉంది. రాజమండ్రి నుంచి ఖమ్మం వైపు కొబ్బరికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపు తప్పి లారీని ఢీకొంది. వ్యాన్ ముందు భాగం నుజ్జవడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి మృతి చెందాడు. హైవే సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసేందుకు గంట పాటు రెస్క్యూ ఆపరేషన్ చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# రాక్షసులుగా మారిన రక్షకులు

**జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఖాకి శాఖకు మాయని మచ్చ**

**బాధిత జర్నలిస్టులను పరామర్శించిన టిఆర్పీ నేతలు**

**విచారణ జరిపి బాధ్యులనులను సస్పెండ్ చేయాలని టిఆర్పీ డిమాండ్**

**టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా**

కరీంనగర్,అక్టోబర్ 15(వాయిస్ టుడే): విధి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ,ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసి థర్డ్ డిగ్రీ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా అన్నారు.సిరిసిల్ల జిల్లా గాంబిరావుపేట ఎస్సై శ్రీకాంత్ చేసిన థర్డ్ డిగ్రీలో గాయపడిన బాధిత జర్నలిస్టులు రాతిపెల్లి సంపత్,శేఖర్ లను టీఆర్పీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ,అధికారులను ప్రశ్నించే జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అత్యంత హేయమైన చర్య అని తీవ్రంగా మండిపడ్డారు.చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని అన్నారు.ఎస్సై థర్డ్ డిగ్రీ చేస్తూ సిఐ మరియు డిఎస్పీలకు వీడియో కాల్ చేసి చూపిస్తూ వారిని దుర్భాశలాడుతూ కర్కశంగా ప్రవర్తించారని తెలిపారని అన్నారు.వార్తలు రాస్తే కక్ష సాధింపులా,పోలీసులను ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని అఖిల్ పాషా హెచ్చరించారు.అనేక అవినీతి ఆరోపణలు ఉన్న ఎస్సై శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదును సిఐ వెంకటేష్ మరియు డిఎస్పీ పరిశీలించకుండా ఎస్సై పాల్పడ్డ ఘటనకు సహకరించిన పోలీసు ఉన్నతాధికారులు సిఐ డిఎస్పీలపై జిల్లా ఎస్పీ నిష్పక్షపాత విచారణ జరిపించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా,జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్,కొత్తపెల్లి మండల అధ్యక్షుడు ఓర్సు రాజు నాయకులు వెంకట్ గౌడ్,కార్తీక్ పాల్గొన్నారు.



Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**